క్లుప్తంగా

శ్రీ మఠంలో సుధర్మేంద్ర ఆరాధన


సుధర్మేంద్ర తీర్థుల బృందావనం వద్ద సుభుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుధర్మేంద్రతీర్థుల ఆరాధన వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి బృందావనానికి ఫల,పుష్ప,క్షీర,పంచామృతాభిషేకాలు జరిపించారు. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు బృందావనానికి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన పుష్పాలతో బృందావనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రీ మఠంలో కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం


పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులతో ఈశ్వరప్ప

మంత్రాలయం రూరల్: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం ఈశ్వరప్ప కుటుంబ సభ్యులతో కలిసి గురువారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి స్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వాదించారు. అంతకు ముందు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

క్రీడల్లో రాణించాలి

ఆదోని అర్బన్: క్రీడల్లో నైపుణ్యత ప్రదర్శించి ఉన్నతస్థాయికి ఎదిగి ఆదోనికి మంచిపేరు తేవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ క్రీడా మైదానంలో జయమనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదోని క్రికెట్ పోటీలు జరిగాయి. వారు మాట్లాడుతూ అంజలీశర్వాణి లాగానే ప్రతిఒక్కరూ జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. నిర్వాహకులు ఉస్మాన్, యాసిన్‌బాషా మాట్లాడుతూ పోటీల్లో 48 టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి

ఆదోని అర్బన్: ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలవెన్సు మంజూరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అర్హతగల సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించి ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. నాయకులు రఘురామయ్య, వెంకటేష్, తిక్కస్వామి, పార్థసారథి, రామసుబ్బారెడ్డి, రాఘవేంద్ర, భీమన్న పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభం


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: వలస ప్రభావిత మండలాల్లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఇటీవల సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలోని కందకూరు, ఐరన్‌గల్లు, కోసిగి చాకలిగేరి, కోసిగి ఆది ఆంధ్ర పాఠశాలల్లో సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక ఆదిఆంధ్ర పాఠశాలలో ఏపీఎం సత్యమ్మ, పాఠశాల హెచ్‌ఎం చంద్రలీల ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో కలిసి సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలం నుంచి కూలీలు అత్యధికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని, దీంతో వారి పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకూడదని ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందన్నారు. వలస వెళ్లిన కుటుంబాలు తమ పిల్లల హాస్టళ్లలో చేర్పించాలని కోరారు. సీసీలు సౌజన్య, సీఆర్పీ అనంత రామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేష్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

చిప్పగిరి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నార ని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రతి పక్షాలు పని గట్టికొని పింఛన్లు రద్దవుతున్నాయని అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సీఎం జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నారన్నారు.

యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఆర్ట్స్ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆదోని అర్బన్: యువతకు స్ఫూర్తి స్వామి వివేకానందుడని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అక్షయ అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సభ్యులు సబ్ కలెక్టర్‌ను కలిసి స్వామివివేకానంద చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఎంపీఐ సిసిరాదీప్తి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఏరియా ఆస్పత్రి వైద్యురాలు భారతికి వివేకానంద చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు నాగరాజు, సురేష్, దేవా పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు నాగరాజు, నరసింహులు, వీరచంద్రయాదవ్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుంకన్న, రామంజి, మహాదేవప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, విరుపాక్షప్ప, ఈరన్న, అధ్యాపకులు అయ్యప్ప, బాలస్వామి, యుగంధర్‌రెడ్డి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

కోసిగి: మండలంలోని పల్లెపాడు గ్రామంలో శివ మాలధారులు, యువత ఆధ్వర్యంలో స్వామి వివేకనంద జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు చేశారు. మాలధారులు లక్ష్మన్న, శేఖర్, భాగ్యప్ప, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వామి వివేకనందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఆదోని రూరల్: దేశ భవిష్యత్ రూపరేఖలు మార్చగల శక్తి యువత నిక్షిప్తమై ఉందని, దాన్ని నేటి తరం సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం స్వామివివేకానంద 160వ జయంతి వేడుకలను స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడారు. నాయకులు శ్రీనివాసులు, భరత్‌కుమార్, గౌస్, గణేష్, నాగార్జున, శివ, నరేష్, రాజు, పవన్, సత్య పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో యువ సంకల్పం ఆధ్వర్యంలో గురువారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానందుడి జయంతిని సంఘం అధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సంఘం సభ్యులు, బీసీ నరసింహులు, రామాంజనేయులు, కృష్ణ, ఉదయ్‌కుమార్, రాజశేఖర్, వీరేష్, కంప్యూటర్ వీరేష్ పాల్గొన్నారు.

కౌతాళం: స్వామి వివేకానంద జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కౌతాళంలోని పండిత్ పుట్టరాజ్ గవాయి ఎడ్యుకేషన్ సొసైటి సీ–టెక్ కంప్యూటర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నిర్వహకుడు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వివేకానంద చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం


పల్లెపాడులో వివేకానంద చిత్ర పటానికి పూజలు చేస్తున్న దృశ్యం


వివేకానంద జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

అద్దె చెల్లించని షాపులకు తాళాలు


దుకాణానికి తాళం వేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులు అద్దె చెల్లించకపోవడంతో గురువారం మూడు షాపులకు అధికారులు తాళాలు వేశారు. స్థానిక పాత బస్టాండులో గ్రామ పంచాయతీ నిధులతో 48 దుకాణాల కాంప్లెక్స్ నిర్మించారు. ఇందులో షాపుల విస్తీర్ణం బట్టి నెల అద్దె రూ.2 వేల నుంచి 4 వేల వరకు చెల్లిస్తున్నారు. వ్యాపారులు 6 నెలలకు ఒక సారి అద్దె చెల్లించాలని నిర్ణయించారు. ఇందులో కొంత మంది ఏడాదికి పైగా అద్దె చెల్లించకపోవడతో పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మూడు షాపులకు తాళాలు వేశారు. సకాలంలో అద్దె చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఏఓ కృష్ణ కుమార్ తెలిపారు. సిబ్బంది రాంబాబు, వరుణ్, వినోద్, జీలాన్ తదితరులు ఉన్నారు.

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో మఠం పరిసరాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజాము నుంచి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథోత్సవాలపై ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం →



సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

నందవరం : వరి సాగు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో రైతు, గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ పొలంలో వరి పంట సాగుపై క్లస్టర్ స్థాయి వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి నాటు వేసేటప్పుడు నారను సుడోమనస్‌తో 10 నిమిషాలు శుద్ధి చేసి నాటుకోవాలని సూచించారు. పైరును కత్తిరించి నాట్లు వేసుకోవాలని, 5 మీటర్ల నాటుతో 2 సెం.మీ కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని చెప్పారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

పథకాలతో పేదల జీవన ప్రమాణాల్లో మార్పు


గృహిణికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- బాపులదొడ్డిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దకడబూరు మండలం బాపులదొడ్డి గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి పథకాలను వివరించి, సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల బతుకుల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అనంతరం గ్రామంలో రూ.3 లక్షలతో డ్రైనేజీ, మట్టిరోడ్డు నిర్మాణాలకు భూమి పూజ గావించారు.

సంపూర్ణ పోషణకు ప్రాధాన్యం..

గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యాలకు తావు లేకుండా చేసేందుకు సంపూర్ణ పోషణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చెప్పారు. గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బాలామృతం, గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరకుంద ఈరన్నస్వామి ట్రస్టు బోర్డు మెంబర్ విజేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, నాయకులు మహాదేవప్ప, ఉరుకుంద, ఎంపీటీసీ మహాదేవమ్మ, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, వ్యవసాయాధికారి వరప్రసాద్, ఏపీఎం మల్లికార్జునప్ప, ఎస్ఐ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఆర్ఐ మహేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాత్యాయణి పాల్గొన్నారు.


గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కక్షలకు దూరంగా ఉండండి

చిప్పగిరి: కక్షలకు, ఘర్షణలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్ఐ మల్లికార్జున సూచించారు. గురువారం ఏరూరు, చిప్పగిరి, డేగులహాలు తదితర గ్రామాలలో ఫ్యాక్షన్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనం అలవాటు చేసుకోవాలన్నారు. ఎంతటి సమస్యలైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- పనిలేకనే ప్రభుత్వంపై ప్రతి పక్షాల విమర్శలు
- ప్రతి గ్రామ సచివాలయంలో రూ 20 లక్షలతో అభివృద్ధి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- ఐరన్‌బండ, గుమ్మరాళ్ల గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ఐరన్‌బండలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. దేవనకొండ మండలం ఐరన్‌బండ, గుమ్మరాళ్ల గ్రామాలలో గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేసి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో దాదాపు అన్ని రకాల పథకాలకు మూడున్నర ఏళ్ల కాలంలో రూ 4 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు.

ఫ్యాక్షన్ నేలపై జల సిరులు

మండలంలో గత పాలకుల సమక్షంలో ఫ్యాక్షన్‌తో కూడిన రాజకీయాలు కొనసాగేవని, దీని వల్ల ఎన్నో కుటుంబాలు వీధి పాలయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి దేవనకొండ మండలంలో దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి హంద్రీనీవా సుజల ప్రవంతి పథకాన్ని అమలు చేసి ఫ్యాక్షన్ గడ్డపై జలపాతాన్ని పారించారన్నారు. రైతులు బంజరు భూముల్లో సిరులు పండిస్తున్నారన్నారు. అందుకు తోడుగా తిరిగిసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేసి ఆర్థిక పరిపుష్టిని చేకూరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నిజాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో వెండి పతకాలు

ఎమ్మిగనూరు: విశాఖలో జరిగిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఎమ్మిగనూరు విద్యార్థి రాఘవ సాయి(18) సత్తా చాటాడు. పట్టణా నికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ నాగలక్ష్మి, వెంకటేశ్ చిన్నకుమారుడు రాఘవసాయి స్థానిక నలంద కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 4 నుంచి విశాఖపట్టణంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ సబ్ జూనియర్ 83 కేజీల వి భాగంలో ఓవర్ ఆల్ ఛాంపియన్, డెడ్ లిఫ్టింగ్ లో ద్వితీయ స్థానం పొంది రెండు వెండి పత కాలు సాధించాడు. తల్లిదండ్రులతోపాటు కోచ్ ఆదోని తల్వార్‌ఖాదర్‌బాషా అభినందించారు.

18న ఎస్ఐ, కానిస్టేబుల్ మోడల్ పరీక్షలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్ఎంకే కోచింగ్ సెంటర్‌లో ఈనెల 18వ తేదీన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకై మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, పట్టణ నాయకులు అజిత్ తెలిపారు. గురువారం మోడల్ పరీక్షలపై కరపత్రాలను కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ఆశాలుక్మాన్‌తో కలిసి ఆవిష్కరించారు.

ముగిసిన వృషభాల బలప్రదర్శన పోటీలు


మొదటి స్థానం కైవసం చేసుకొన్న వృషభాలతో యజమాని

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మిగనూరు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన నాలుగు క్యాటగిరీల విభాగాల ఒంగోలు ఎద్దుల(ఎద్దుల బండలాగుడు) బలప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. చివరిరోజు జరిగిన సీనియర్ క్యాటగిరీ విభాగం వృషభాల పోటీల్లో నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మూడురాళ్ల పల్లె వృషభాలు విజేతగా నిలిచాయి. వాటి యజమాని పులిచిన్నఓబులేరెడ్డికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి రూ.1లక్ష నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా రెండో స్థానాన్ని పీఆర్ పల్లె గ్రామానికి చెందిన మంగలినాగయ్య ఎద్దులు కైవసం చేసుకోగా రూ.75వేలు, మూడవ బహుమతిని అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి కె.రామాంజినేయులు వృషభాలు రూ.50వేలు, నాల్గవ బహుమతి నంద్యాల జిల్లా బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమాగోవర్ధన్‌రెడ్డి ఎద్దు రూ.30వేల నగదు బహుమతిని దక్కించుకున్నాయి. ఐదో స్థానంలో డోన్ మండలం కొత్తకోటకు చెందిన డాక్టర్ గుర్నాథ్ వృషభాలు రూ.20వేలు బహుమతిగా పొందాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సోగనూరు భీమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ ఆగ్రోస్' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గిడ్డారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: డాక్టర్ వైఎస్సార్ ఏపీ ఆగ్రోస్ ఎంటర్‌ప్యూనర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సోగనూరు బదినెహాల్ గిడ్డారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం అమరావతిలోని ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నందారపు చెన్నకృష్ణారెడ్డిని, ఉపాధ్యక్షులుగా బి.గిడ్డారెడ్డితో పాటు కమిటీని ఎన్నుకోవటం జరిగింది.

ముగ్గుల పోటీలు


బహుమతి అందజేస్తున్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని అర్బన్ : పట్టణంలోని స్వకుళసాలి మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్ట్ లైన్ అంబాభవానీ ఆలయ ప్రాంగణంలో గురువారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత పాల్గొని ముగ్గులను పరిశీలించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షురాలు లోకేశ్వరిభాయి, మహిళా మండలి అధ్యక్షురాలు కల్యాణి, సభ్యులు రాజేశ్వరి, నాగవేణి, నాగజ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

అద్దె పెంపును విరమించుకోవాలి

ఆదోని అర్బన్ : తిరుమలలో వసతి గృహాల అద్దె పెంపు నిర్ణయాన్ని టీటీడీ బోర్డు విరమించుకోవాలని గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు ప్రకాష్‌జైన్, విట్టా రమేష్, లోకేష్‌కుమార్, నాగరాజుగౌడ్ మాట్లాడారు. వేంకటేశ్వర స్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకుని అద్దె పెంపు నిర్ణయం మంచిది కాదన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మలేకర్ శ్రీనివాసులు, వడ్డే శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

కౌతాళంలో పారిశుద్ధ్య పనులు

కౌతాళం: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలనీ వాసులు ఫిర్యాదు మేరకు సర్పంచ్ పాల్‌దినకర్ పనులను పరిశీలించారు.

బియ్యం విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి టెక్సాస్‌కు చెందిన శ్రీభాస్కరన్ వరదరాజన్ అనే భక్తుడు రూ. లక్ష విలువజేసే బియ్యం విరాళంగా అందజేశారని శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దాతకు స్వామివారి మెమొంటో, ఫలమంత్రాక్షతలిచ్చి, పరిమళ ప్రసాదం అందజేశారు.

క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆదోని రూరల్ : మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ టీం ఆ గ్రామ పరిధిలోని భూములన్నింటినీ సందర్శించి రైతుల సమక్షంలో విచారణ చేస్తారని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం బైచిగేరి గ్రామంలో పర్యటించి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ వీర్వోలు, విలేజ్ సర్వేయర్‌కు సహకరించి వారి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. పేరు సవరణ, అనుభవ స్వభావం, చనిపోయిన తల్లిదండ్రుల పేరిట ఉన్న పాస్‌బుక్‌లు వారసులు తమ పేరిట మార్చకోవడం తదితర వాటిని వీఆర్వోలకు తెలియజేసి, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆదోని రూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ వీరేష్ (24) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 2న ముచ్చగేరికి పని నిమిత్తం వెళ్లి తిరిగి తన స్నేహితుడు గోవిందరాజుతో కలిసి మోటార్ సైకిల్‌పై వస్తుండగా బైకుపై నుంచి ఎగిరి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో వీరేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని, మృతుడి తండ్రి ముక్కరగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

దర్గాలో భక్తుల సందడి


సమాధిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా గురువారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గా పదో ధర్మకర్తగా, ముతవల్లిగా 41సంవత్సరాలు సేవలందించి గత ఏడాది మృతి చెందిన సయ్యద్ సాహెబ్‌పీర్ హుశేని చిష్టీ మొదటి ఉరుసు ఆదివారం కర్ణాటక రాష్ట్రం కురుగోడులో నిర్వహించనున్నారు. శుక్రవారం కౌతాళం నుంచే కురుగోడుకు గంధం వెళ్తుండటంతో గురువారం నుంచి ఖాదర్‌లింగ స్వామి దర్శనంతో పాటు సయ్యద్ సాహెబ్‌పీర్ ఉరుసులో పాల్గొనేందుకు భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.